క్లుప్తంగా

బొడిగె శోభను పరామర్శించిన బండి



సైదాపూర్: చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ భర్త గాలన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. శోభ కుటుంబ సభ్యులను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. శోభ కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందని బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బొమ్మా శ్రీరాంచక్రవర్తి, మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

విజేతలకు బహుమతులు పంపిణీ



చొప్పదండి: ఆర్నకొండ గ్రామ సమీపంలో నిర్వహించిన జిల్లాస్థాయి గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు ఆదివారం బహుమతులను పంపిణీ చేశారు. ప్రకాశం అకాడమీ గ్రౌండ్‌లో పక్షం రోజులుగా నిర్వహించిన జిల్లా గ్రామీణస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో 32 జట్లు పాల్గొన్నాయి. కూర్మపల్లి జట్టు విజేతగా నిలవగా.. గంగాధర జట్టు రన్నరప్‌గా నిలిచింది. విన్నర్‌కు రూ.5వేలు, రన్నర్‌కు రూ.3వేలు, సెమీఫైనల్‌లో నిలిచిన జట్లకు రూ.1,500 చొప్పున నగదు బహుమతులను నిర్వాహకులు అందించారు. ఈ కార్యక్రమంలో ముచ్చర్ల మునిందర్‌రెడ్డి, ద్యావ నీవన్‌రెడ్డి, ఆనందరెడ్డి, అశోక్‌రెడ్డి, ప్రవీణ్, అంజి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వీణవంక: శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో చదువుకున్న 2006–07 పదోతరగతి విద్యార్థులు ఆనాటి ఉపాధ్యాయుడు, ప్రస్తుతం పాత్రికేయ వృత్తిలో పని చేస్తున్న పత్తి కొండాల్‌రెడ్డికి చేయూతనందించారు. ఇటీవల అనారోగ్యానికి గురి కాగా.. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆరోగ్య ఖర్చుల నిమిత్తం రూ.30వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మ్యాకల అశోక్, నీల శ్రీనివాస్, పోతరవేన రాజ్‌కుమార్, కూన శ్రీనివాస్, పంజాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవైష్ణవ సేవాసంఘం సన్నాహక సమావేశం



పాల్గొన్న సభ్యులు

ఇల్లందకుంట: శ్రీవైష్ణవ సేవాసంఘం స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో వైష్ణవ సంఘం ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న పేద బ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శేషం రామాచార్యులు, శేషం వంశీధర్ ఆచార్యులు, డింగరి రవికుమర్, శ్రీధర్‌చార్యులు, సుదర్శనాచార్యులు, ప్రసాదాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలో చేరిన నాయకులతో వొడితెల ప్రణవ్

హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ సమక్షంలో బీజేపీ, బీఆర్ఎస్ ప్రజాప్రతినిదులు, నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండవా కప్పి ఆహ్వానించారు. వొడితల ప్రణవ్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి పాటుపడుదామని కోరారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. మల్లారెడ్డిపల్లి సర్పంచ్ ఎల్లారెడ్డి, ఉప సర్పంచ్ భిక్షపతి, మాజీ సర్పంచ్ ముద్దసాని సమ్మయ్య, వీణవంక మండలాధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌రెడ్డి, నాయకులు మేకల కోమల్‌రెడ్డి, గుమ్మ రవి, కర్రి రాజయ్య, 300 మంది బీజేపీ నాయకులు, బీఆర్ఎస్ ఇల్లందకుంట సీనియర్ నాయకులు సామల రాజారెడ్డి తన అనుచరులతో చేరారు.

ప్రకృతి ఒడి.. పచ్చని బడి



పచ్చని చెట్లతో జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల



పచ్చని చెట్ల మధ్య విద్యార్థుల మధ్యాహ్న భోజనం

- ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువులు
- ఆకట్టుకుంటున్న జంగపల్లి ప్రభుత్వ పాఠశాల

గన్నేరువరం: ప్రభుత్వ పాఠశాలలంటే ఒకప్పుడు చెత్తాచెదారానికి, పిచ్చి మొక్కలకు నిలయంగా ఉండేవి. కానీ ప్రస్తుతం పూర్తి విరుద్ధంగా ఆహ్లాదకరమైన వాతావరణానికి, పచ్చని మొక్కలకు, పచ్చదనానికి నిలయంగా మారుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పచ్చదనం ఉట్టిపడుతోంది. అందమైన వివిధ మొక్కలతో ఆకట్టుకుంటోంది జంగపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల. గతంలో గుంతలు, పిచ్చి చెట్లతో, విష సర్పాలతో విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. కానీ నేడు ఆ స్థలాల్లోనే పచ్చని చెట్ల మధ్య సేదతీరుతూ చదువుతున్నారు.

269 మంది..

జంగపల్లి గ్రామ ఎక్స్ రోడ్డులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉంది. గుండ్లపల్లి నుంచి మండల కేంద్రానికి ప్రధాన రహదారి పక్కనే విశాలమైన స్థలంలో ఈ పాఠశాలను నిర్మించారు. ఈ పాఠశాల జంగపల్లి, హన్మాజిపల్లె, గోపాల్‌పూర్, మాధాపూర్ గ్రామాలకు సమాన దూరంలో ఉంటుంది. దీంతో ఈ గ్రామాలతో పాటు పీచుపల్లి, గునుకులకొండాపూర్, చీమలకుంటపల్లె, గుండ్లపల్లి నుంచి ఈ పాఠశాలలోనే ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 269 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు ఈ పాఠశాల దుస్థితి అధ్వానంగా ఉండేది. ఎటు చూసిన గుంతలమయంగా ఉండేది. నీటి వసతి కూడా సక్రమంగా ఉండేది కాదు. 2014లో సాక్షిలో కథనం మేరకు ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ఈ పాఠశాలపై దృష్టి సారించారు. నాలుగేళ్లలో పాఠశాలలో సమూల మార్పులు తీసుకొచ్చారు. ఒక్కో సమస్యను అధిగమిస్తూ నాడు సమస్యలతో కొట్టుమిట్టాడిన పాఠశాల.. నేడు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సంతరించుకుంది.

పచ్చదనం..

ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు భాగంలో ఉన్న విశాలమైన స్థలంలో ఉన్న గుంతలను జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించి పూడ్చివేశారు. స్థల మొత్తాన్ని చదును చేశారు. 2016–17లో రెండో విడత హరితహారం కార్యక్రమంలో పాఠశాలలో చదును చేసిన స్థలంలో అప్పటి ఎమ్మెల్యే, జెడ్పీటీసీ, స్థానిక నాయకులు మొక్కలు నాటారు. 2017–18లో మూడో విడత హరితహారంలో మరిన్ని మొక్కలు నాటారు. ఈ క్రమంలో మొత్తం 1,850 మొక్కలు నాటారు. సుమారు 1,000 మొక్కలున్నాయి. వీటి రక్షణకు ప్రజాప్రతినిధులు నిధులు కేటాయించి ప్రత్యేకంగా బోరు వేయించారు. ఒకప్పుడు పాఠశాలలో నీడ కరువు కాగా.. మొక్కలన్నీ చెట్లుగా మారి ఆహ్లాదం నెలకొంది. కొద్ది సంవత్సరాలుగా పాఠశాల రూపురేఖలే మారిపోయాయి. పచ్చని చెట్ల మధ్యే విద్యార్థులు భోజనం చేస్తూ సేదతీరుతున్నారు.

ప్రహరీ పూర్తి

సమస్యలను ఒక్కొక్కటి పరిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు ప్రహరీ నిర్మాణంలో మాత్రం ఆలస్యం చేశారు. ప్రహరీ లేక చెట్ల రక్షణ కష్టంగా మారుతుందని ఉపాధ్యాయులు, స్థానికులు ఆందోళన చెందారు. పశువులు వచ్చి మొక్కలను ధ్వంసం చేశాయి. రాత్రి మందుబాబులకు అడ్డాగా మారింది. ఐదేళ్ల క్రితం గోడ నిర్మాణాన్ని ప్రజాప్రతినిధులు చేపట్టి పూర్తి చేశారు. పాఠశాల లోనికి అనుమతి లేనిదే ఎవరు రాకుండా గేట్ ఏర్పాటు చేశారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో అదనపు గదులు నిర్మించడంతో తరగతుల నిర్వహణకు ఇబ్బందులు తొలగిపోయాయి.

చెట్ల మధ్యే భోజనం..

హరితహారం పథకంలో నాటిన మొక్కలతో నేడు పాఠశాల ఆవరణ మొత్తం పచ్చదనంగా మారిపోయింది. పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదరకమైన వాతావరణంలో చదువుకుంటున్నాం. మాధ్యాహ్న భోజనం కూడా ఆ చెట్ల మధ్యే చేస్తున్నాం. రానున్న రోజుల్లో ఈ పాఠశాల వృక్షాలతో వనంగా మారునుంది.



- గణేశ్‌రెడ్డి, హన్మజిపల్లె, 6వతరగతి

ఆటలకు ఇబ్బంది ఉండేది

సమస్యలతో సతమతమయ్యే పాఠశాలలో సమస్యలను ఒక్కొక్కటిగా ప్రజాప్రతినిధులు పరిష్కరిస్తున్నారు. గతంలో పాఠశాల మైదానం గుంతలమయంగా ఉండేది. ఆటలకు ఇబ్బంది ఉండేది. గుంతల్లో మట్టి పోసి చదును చేశారు. ప్రహరీని సైతం పూర్తి చేశారు.



- అనిల్‌కుమార్, జంగపల్లి, 10వతరగతి

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేద్దాం



మాట్లాడుతున్న సుంకె

గంగాధర: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలం కలిసికట్టుగా పని చేద్దామని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుంకె రవి శంకర్ పిలుపునిచ్చారు. మధురానగర్‌లో ఆదివారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వచ్చేనెల 3న నిర్వహిస్తున్న సన్నాహక సమావేశానికి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారన్నారు. ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ నియోజకవర్గ అభివృద్ధికి నయా పైసా తేలేదని అన్నారు. వినోద్‌కుమార్ ఎంపీగా ఉన్న సమయంలో నియోజకవర్గ అభివృద్ధికి రూ.10వేల కోట్లు తీసుకొచ్చారన్నారు. వినోద్‌కుమార్‌ని రాబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపిద్దామని పిలుపునిచ్చారు.

ట్రస్మా జిల్లా కోశాధికారిగా శ్రీనివాస్



మానకొండూర్: గంగిపల్లి గ్రామానికి చెందిన రంగు శ్రీనివాస్ ట్రస్మా జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. రంగు శ్రీనివాస్ గంగిపల్లి శ్రీసరస్వతి విద్యాలయం కరస్పాండెంట్‌గా కొనసాగుతున్నారు. కొన్నేళ్లుగా ట్రస్మాలో వివిధ బాధ్యతలు చేపట్టిన ఆయనను జిల్లా కోశాధికారిగా ఎన్నుకున్నారు. గంగిపల్లి ఎంపీటీసీ సభ్యుడు రంగు భాస్కరాచారి, పలువురు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందజేస్తున్న లింగయ్య

జమ్మికుంట: క్రీడలతో శారీరక దృఢత్వం, మానసికోల్లాసం పెంపొందుతుందని 57 ఉప కూలాల హుజూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు తూర్పటి లింగయ్య అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో హుజూరాబాద్ డివిజన్ స్థాయి జేపీఎల్(జమ్మికుంట ప్రీమియర్ లీగ్) క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో హుజూరాబాద్, చెల్పూర్ జట్లు పోటీ పడగా.. హుజూరాబాద్ జట్టు గెలుపొందింది. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అచ్యుత్‌రెడ్డి(టీకుర్తి), మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ దేవరాజు(హుజూరాబాద్) దక్కించుకున్నారు. కప్‌ను హుజూరాబాద్ కైవసం చేసుకుంది. విజేతకు రూ.20వేల నగదు, రన్నర్‌కు రూ.10వేల నగదుతో పాటు కప్పులను నిర్వాహకుడు తూర్పటి లింగయ్య అందజేశారు. ఆర్గనైజర్ బత్తుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ మండలాధ్యక్షుడిగా మహేందర్



హుజూరాబాద్‌రూరల్: జూపాక గ్రామానికి చెందిన గిన్నారపు మహేందర్‌ను బీఎస్పీ మండలాధ్యక్షుడిగా నియమిస్తూ నియోజకవర్గ అధ్యక్షుడు వాసాల రామస్వామి ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కృషి చేసిన నియోజకవర్గ అధ్యక్షులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన నియామకం



మానకొండూర్: కాంగ్రెస్ మానకొండూర్ మండల ఉపాధ్యక్షుడిగా లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఎడ్ల శ్రీధర్ నియామకమయ్యారు. నియామక పత్రాన్ని మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి అందజేశారు. శ్రీధర్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్, జిల్లా కార్యదర్శి మీస సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి కొత్తకొండ శంకర్, జిల్లా కార్యదర్శులు ఇర్ఫాన్, గసిగంటి సంపత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

‘అనగనగా.. మా బడిపిల్లల కథలు’ ఆవిష్కరణ

కరీంనగర్‌కల్చరల్: తెలుగు ఉపాధ్యాయుడు మాడుగుల రాములు ప్రధాన సంపాదకుడిగా చొప్పదండి జెడ్పీహెచ్ఎస్ బాలికల హైస్కూల్ విద్యార్థులచే రాయించిన ‘అనగనగా.. మా బడి పిల్లల కథలు’ సంకలనాన్ని ఆదివారం జెడ్పీ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు, కటుంబ సభ్యులు, స్నేహితులు చెప్పగా విన్న నీతి కథలను 84 మంది చిన్నారులు తమ సొంత మాటల్లో రాశారు.



అ‘పూర్వ’ సమ్మేళనం

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకున్న 2003–06కు చెందిన పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనాన్ని ఆదివారం జరుపుకున్నారు. సభా అధ్యక్షుడు అసిస్టెంట్ ప్రొఫెసర్ రవి సమావేశం నిర్వహించారు. ఆనాటి గురువైన రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సాంబశివరావు, శ్రావణ్‌కుమార్ హాజరయ్యారు. గురువులను సన్మానించారు. కళాశాల చరిత్ర గొప్పదని కొనియాడారు. పూర్వ విద్యార్థులు జెడ్పీటీసీ శ్రీరామ్ శ్యామ్, సంతోష్, తాజుద్దీన్, శివకృష్ణ, రమేశ్, ప్రభాకర్, శ్రీనివాస్, లక్ష్మణ్, నాగరాజు, రజిత, సంపూర్ణ, సునీత, విజయ, గీతారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఆటపాటలతో అలరించిన ‘ఆత్మీయ’ వేడుక

మానకొండూర్: స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1988–89 సంవత్సరంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి గురువులైన కంది మల్లారెడ్డి, జాలి మహేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, సత్యనారాయణ, నందగిరి వెంకటేశం, మాడిశెట్టి అంతయ్య, వంగల శ్రీనివాస్‌ను ఘనంగా శాలువాలతో సన్మానించారు. మెమొంటోలను అందజేశారు. ఉపాధ్యాయుల ఉపన్యాసాలతో పాటు ఆటపాటలతో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. పూర్వ విద్యార్థులు 150 మందితో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



గంగాధర: కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సీఎస్‌సీ సెంటర్ ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. నారాయణపూర్ గ్రామంలో గౌడ సంఘ భవనం, మహిళా సంఘ భవనాలను ప్రారంభించారు. రంగరావుపల్లి గ్రామంలో వైకుంఠధామం, రెడ్డి సంఘం భవన పనులను ప్రారంభించారు. మల్లాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లను ప్రారంభించారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ప్రారంభం

చొప్పదండి: దేశాయిపేటలో నిర్మించిన నూతన పంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో నిర్మించిన మహిళా సంఘం, అంబేడ్కర్ సంఘం, వైకుంఠధామాలను ప్రారంభించారు. సర్పంచ్ గుంట రవి, ఎంపీటీసీ కుకట్ల తిరుపతి, నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, ముద్దం తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు..

రామడుగు: దత్తోజీపల్లి గ్రామ పరిధిలో రూ.72.45లక్షలతో నిర్మించే బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే సత్యం శంకుస్థాపన చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. సర్పంచ్ బండ అజయ్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్, నాయకులు కోల రమేశ్, బొమ్మరవేని తిరుపతి, తడగొండ హన్మంతు, పంజాల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న రసమయి

గన్నేరువరం: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను వెంటనే అమలు చేయాలని మానకొండూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. ఆదివారం గన్నేరువరంలోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 2నెలలు కావస్తున్నా కేవలం రెండు హామీలను మాత్రమే అమలు చేశారని, రైతు భరోసా సాయం ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. గతంలో అభివృద్ధే జరగలేదన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలనే ప్రారంభించారని ఎద్దేవా చేశారు. కవ్వంపల్లి బెదిరింపులకు భయపడే వ్యక్తులు బీఆర్ఎస్ నాయకులు కాదని, తెలంగాణ ఉద్యమంలో పోరాటంలో అనేక సవాళ్లు ఎదుర్కొని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని తెలిపారు. రాజన్నసిరిసిల్ల జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, సర్పంచ్, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి ఆంజనేయులు, తీగల మోహన్‌రెడ్డి, సర్పంచ్ అటికం శారద, నాయకులు పుల్లెల లక్ష్మణ్, తోట కోటేశ్వర్, న్యాత సుధాకర్ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం



మాట్లాడుతున్న అంజయ్య

మానకొండూర్: మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌పై జెడ్పీటీసీ గీకురు రవీందర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబు కాదని, తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని చిగురుమామిడి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మామిడి అంజయ్య, మండల కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం చిగురుమామిడిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రవీందర్‌కు దమ్ము, ధైర్యం ఉంటే జెడ్పీటీసీ పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందాలని కోరారు. దాదాపు తొమ్మిదిన్నర ఏళ్ల ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎక్కడ సమస్య ఉంటే అక్కడ వాలిపోయి వాటిని పరిష్కరించిన మాజీ ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి గీకురు రవీందర్‌కు లేదన్నారు. తన స్వలాభం కోసం కాంగ్రెస్‌లో చేరి బీఆర్ఎస్‌ను విమర్శిస్తే సహించబోమని హెచ్చరించారు. మండల ప్రధాన కార్యదర్శి మంకు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పెసరి రాజేశం, మండల మాజీ అధ్యక్షుడు రామోజు కృష్ణమాచారి, జిల్లా రైతుబంధు సమితి మాజీ సభ్యుడు సాంబారి కొంరయ్య, మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు పెనుకుల తిరుపతి, నాయకుడు సదానందం పాల్గొన్నారు.

గౌడ శంఖారావం క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



తిమ్మాపూర్: అలుగునూర్లోని సర్వాయి పాపన్న విగ్రహం వద్ద ఆదివారం గౌడ శంఖారావం క్యాలెండర్, డైరీ, మాస పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎడిటర్ ఇన్ చీఫ్ అమరగాని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. గౌడ శంఖారావం మాస పత్రిక 20 సంవత్సరాలు పూర్తి చేసుకుందని, గౌడులందర్నీ మమేకం చేసేందుకే గౌడ శంఖారావం ఆవిర్భవించిందని అన్నారు. సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కలర్ సత్తన్న మాట్లాడుతూ.. పాపన్న విగ్రహం వద్ద క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ మాట్లాడుతూ.. గౌడ శంఖారావం క్యాలెండర్‌లో గౌడ ముఖ్యులందరూ ఉంటారని, అందరి ఫోన్ నెంబర్లు ఇందులో ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని పంచముఖ హనుమాన్ ఆలయ 11వ వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆదివారం పీఠాధిపతి బ్రహ్మనందగిరిస్వామి ఆవిష్కరించారు. ఫిబ్రవరి 12,13వ తేదీల్లో ఉత్సవాలు నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ ఆనంద్, శ్రీనివాస్, తోట రాజేందర్, పిట్ల స్వామి, దేవిశెట్టి హనుమాండ్లు పాల్గొన్నారు.